

sahanamvande.com

epaper.sahanamvande.com

సహానం వందే



హైదరాబాద్ | 03-10-2026 శనివారం | సంపుటి-02 సంచిక : 162 EDITOR: ROHINI

పెద్దోళ్లం కాదు చిన్నోళ్లమే

పెద్దల సభకు కాంగ్రెస్ యంగ్ లీడర్స్ వెనుకంజ

- ఎమ్మెల్సీ టిక్కెట్టుపై గుత్తా, రాంరెడ్డి అనాసక్తి
- ఎమ్మెల్యేగా పాగా వేయాలన్నదే వీరి లక్ష్యం
- ఎంపిక చేయడంపై సర్వోత్తమ్ రెడ్డి ఆవేదన
- కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్సీ ఎన్నికల రగడ


రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి

సాధారణంగా ఏ పార్టీ అయినా అధికారంలో ఉన్నప్పుడు పదవుల కోసం నేతలు తీవ్ర స్థాయిలో పోటీ పడతారు. కాంగ్రెస్ శ్రేణుల్లో కూడా అదే జోష్ ఉండాలి. కానీ, నల్లగొండ-ఖమ్మం-వరంగల్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానంలో దానికి పూర్తి భిన్నమైన పరిస్థితి ఉంది! మొదట్లో పోటీలో ఉండాలని భావించిన గుత్తా అమిత్ రెడ్డి హఠాత్తుగా రేసు నుండి ఎందుకు తప్పుకున్నారు? ఆ తర్వాత పార్టీ అధిష్టానం టికెట్ ప్రకటించిన రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ఎందుకు అసంతృప్తితో ఉన్నారు? గెలిచే అవకాశం ఉన్న సీట్లో పోటీ చేయడానికి నేతలు ఎందుకు వెనకడుగు వేస్తున్నారు? దీని వెనక వారి వ్యూహాలు ఏంటి? - సహనం వందే, నల్లగొండ

నల్లగొండ-ఖమ్మం-వరంగల్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానం నుంచి గుత్తా అమిత్ రెడ్డి రేసు నుంచి తప్పుకోవడం కాంగ్రెస్ పార్టీలో దుమారం లేపుతోంది. శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కుమారుడైన అమిత్ రెడ్డి మొదట్లో ఈ టికెట్ కోసం ప్రయత్నించారన్న ప్రచారం ఉంది. అయితే అనూహ్యంగా ఆయన వైదొలగడం వెనుక పెద్ద రాజకీయ వ్యూహమే ఉందని అంటుంటారు. భవిష్యత్తులో ఎమ్మెల్యేగా పోటీ చేయాలన్న ఉద్దేశంతోనే ఆయన సైలెంట్‌గా తప్పుకున్నారనే ప్రశ్నలు కాంగ్రెస్ వర్గాల్లో గట్టిగా వినిపిస్తున్నాయి. పార్టీ అధికారంలో ఉండి, గెలిచే అవకాశాలు పుష్కలంగా ఉన్న చోట ఒక సీనియర్ నేత వారసుడు వెనక్కి తగ్గడంపై సాధారణ కార్యకర్తలు తీవ్ర గందరగోళంలో పడ్డారు.

మరో యంగ్ స్టర్ కూడా అదే బాట...

గుత్తా అమిత్ రెడ్డి తప్పుకున్న తర్వాత అధిష్టానం రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి పేరును అధికారికంగా ప్రకటించింది. కానీ తీరా టికెట్ వచ్చాక ఆయన కూడా బరిలోకి దిగేందుకు సుముఖంగా లేరనే ప్రచారం జరుగుతుంది. కనీసం ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా, తనతో చర్చించకుండా ఏకపక్షంగా అభ్యర్థిత్వాన్ని ఎలా ప్రకటిస్తారని ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అంటున్నారు. ఒకరు రేసు నుండి తప్పుకుంటే, మరొకరు ఇచ్చిన టికెట్‌ను వద్దనడం కాంగ్రెస్‌లో మునుపెన్నడూ లేని విచిత్ర పరిస్థితికి దారితీసింది.

సూర్యాపేట వైపు కన్ను...

సర్వోత్తమ్ రెడ్డి దృష్టి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానంపై లేదు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో సూర్యాపేట నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయాలనేది ప్రధాన లక్ష్యం. ఎమ్మెల్సీ సీటు తీసుకుంటే రేపు అసెంబ్లీ టికెట్ దక్కదనే భయంతోనే ఆయన ఈ అభ్యర్థిత్వాన్ని వద్దంటున్నట్లు తెలుస్తోంది. తన రాజకీయ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకునే ఈ నిర్ణయం తీసుకున్నారని సమాచారం. ఈ ఊహించని పరిణామాలతో సర్వోత్తమ్ ఇప్పుడు కాంగ్రెస్‌కు చెందిన ముఖ్య నేతలు, మంత్రులను వరుసగా కలుస్తున్నారు. ఎమ్మెల్సీ పోటీపై తనకున్న అభ్యంతరాలను స్పష్టంగా వివరిస్తూ భవిష్యత్తులో సూర్యాపేట నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అయితే ఒకసారి అధికారికంగా ప్రకటించాక అభ్యర్థిని మార్చడం పార్టీకి రాజకీయంగా ఇబ్బంది అవుతుందని సీనియర్లు ఆయనను బుజ్జగించే ప్రయత్నాలు చేస్తున్నారు.

బలమైన మంత్రులు... గ్యారెంటీ సీటు

ఇక్కడ అందరినీ ఆలోచింపజేస్తున్న ప్రధాన అంశం ఏంటంటే.. ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ప్రాంతంలో కాంగ్రెస్‌కు అపారమైన బలముంది. ఈ జిల్లాల నుంచే హేమాహేమీలైన మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అంత ఘనమైన నాయకత్వం ఉండి కూడా ఈ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంపికలో అంతర్గత సమన్వయం ఎందుకు దెబ్బతిన్నదనేది పెద్ద ప్రశ్నగా మారింది. గుత్తా అమిత్ రెడ్డి తప్పుకోవడం నుంచి సర్వోత్తమ్ రెడ్డి విముఖత చూపడం వరకు అంతటా


గుత్తా అమిత్ రెడ్డి

సీనియర్ల సమన్వయ లోపమే కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

నెగెటివ్ వాతావరణంతో తలనొప్పి...

గెలిచే స్థానంలో ఇలాంటి నెగెటివ్ వాతావరణం రావడం కాంగ్రెస్ క్యాడర్‌ను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. మరోవైపు సూర్యాపేట సీటును ఇప్పుడే ఖరారు చేయడం అధిష్టానానికి అసాధ్యమైన పని. కానీ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ మాత్రం వేగంగా సాగుతుండటంతో సర్వోత్తమ్ రెడ్డిని ఎలాగోలా నచ్చజెప్పి ప్రస్తుతానికి పోటీలో ఉంచడం తప్ప పార్టీ ముందు మరో ప్రత్యామ్నాయం కనిపించడం లేదు. మరి అధిష్టానం బుజ్జగింపులకు ఆయన లొంగుతారా? లేక కాంగ్రెస్ మరో కొత్త అభ్యర్థిని వెతుక్కుంటుందా అనేది రాబోయే రోజుల్లో తేలనుంది.

సుఖ ప్రయాణం... మోయలేని భారం

మెట్రో, బస్సు పాస్ నెలకు రూ. 8,500

- రోజువారీ పాస్ ధర ఏకంగా రూ. 400
- కన్నీళ్లు పెట్టిస్తున్న మెట్రో, బస్సు కామన్ పాస్

హైదరాబాద్‌లో రోజూ ఆఫీసులకి, పనులకి తిరిగే వాళ్లకు ఒకే ఒక్క కోరిక ఉంటుంది. జేబులో అనేక కార్డులు, చేతిలో రకరకాల టికెట్లు లేకుండా హాయిగా ప్రయాణం చేయాలని. సరిగ్గా అలాంటి ప్రయాణికుల కోసమే ప్రభుత్వం ఒక సరికొత్త నిర్ణయం తీసుకుంది. అదే మెట్రో, ఆర్టీసీ కామన్ పాస్. కానీ ఈ పాస్ వివరాలు, ముఖ్యంగా దీని ధరలు చూశాక జనాలు నోరెళ్ళబెడుతున్నారు. అసలు ఈ కామన్ పాస్ కథేంటి, దీని వల్ల ఎవరికి ప్రయోజనం, ధరల విషయంలో సోషల్ మీడియాలో ఎలాంటి చర్చ నడుస్తోందో చూద్దాం. - సహనం వందే, హైదరాబాద్



హైదరాబాద్ నగరంలో పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌ను మరింత సులభతరం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. నగరంలో ప్రతిరోజూ లక్షలాది మంది ప్రయాణికులు ఒక చోటు నుంచి మరో చోటుకు వెళ్తుంటారు. కొంతమంది ఆర్టీసీ బస్సుల్లో వెళ్తే, మరికొందరు మెట్రో రైళ్లను ఆశ్రయిస్తుంటారు. అయితే రెండింటికీ వేర్వేరుగా టికెట్లు లేదా పాస్‌లు తీసుకోవడం కాస్త ఇబ్బందికరంగా మారేది. ఈ సమస్యకు పరిష్కారంగానే ఒకే పాస్‌తో రెండింటిలోనూ ప్రయాణించే వెసులుబాటును తీసుకొచ్చారు.

ప్రజాభవన్‌లో కామన్ పాస్ గ్రాండ్ లాంచ్

ఈ కామన్ పాస్ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రజాభవన్‌లో చాలా గ్రాండ్‌గా నిర్వహించారు. తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేతుల మీదుగా ఈ పాస్‌ను అధికారికంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి అజారుద్దీన్‌తో పాటు రవాణా శాఖకు చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. నగర రవాణా వ్యవస్థలో ఇదొక మైలురాయి అని అధికారులు ఈ సందర్భంగా చెప్పుకొచ్చారు.

మెంటల్ ఎక్కిస్తున్న రేట్లు...

ఈ పథకంలో భాగంగా రెండు రకాల పాస్‌లను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఒకటి రోజువారీ పాస్ కాగా, రెండోది నెలవారీ పాస్. ప్రతిరోజూ నగరంలో వేర్వేరు పనులపై తిరిగే వారి కోసం రోజువారీ పాస్ ధరను రూ. 400గా నిర్ణయించారు. అలాగే రెగ్యులర్‌గా ఉద్యోగాలకు వెళ్లే వారి కోసం నెలవారీ పాస్ ధరను రూ. 8,500గా ఖరారు చేశారు. ఈ పాస్ రావడం వల్ల సాధారణ ప్రయాణికులకు సమయం చాలా వరకు ఆదా అవుతుంది. ప్రతీసారి మెట్రో స్టేషన్లలో టికెట్ల కోసం క్యూ లైన్లలో నిలబడాల్సిన పని ఉండదు. అలాగే ఆర్టీసీ బస్సు ఎక్కిన ప్రతిసారీ చిల్లర సమస్యలతో సతమతం కావాల్సిన అవసరం ఉండదు. ఒక్క పాస్ చేతిలో ఉంటే చాలు హాయిగా బస్సు లేదా మెట్రో రైలు ఎక్కి అనుకున్న గమ్యస్థానానికి చేరుకోవచ్చు.

కామన్ పాస్ ధరలపై అభ్యంతరాలు

అయితే ఈ పాస్ ధరలపై ఇప్పుడు నగరంలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. సాధారణంగా ఆర్టీసీ లేదా మెట్రోలో విడివిడిగా ప్రయాణించే వారికి అయ్యే ఖర్చుతో పోలిస్తే ఈ కామన్ పాస్ ధర కాస్త ఎక్కువగా ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా మెట్రోలో రోజుకు రెండు వైపులా ప్రయాణిస్తే గరిష్టంగా రూ. 120 నుంచి రూ. 150 వరకు ఖర్చు అవుతుంది. ఇక ఆర్టీసీ బస్సులతో కలిపినా కూడా ఈ మొత్తం అంతగా ఉండదని ప్రయాణికులు లెక్కిస్తున్నారు. దీనివల్ల నిత్యం ఎక్కువ దూరం, విభిన్న ప్రాంతాలకు తిరిగే బిజినెస్ ప్రొఫెషనల్స్‌కు మాత్రమే ఇది ఉపయోగపడేలా ఉంది. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టాలంటే ఎక్కువ మంది సొంత వాహనాలు వదిలేసి పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ వైపు రావాలి. అలా రావాలంటే ఈ కామన్ పాస్ వ్యవస్థ ఎంతో దోహదపడుతుంది. కానీ ధరల విషయంలో పునరాలోచిస్తే మరింత మంది ఈ సేవలను వినియోగించుకునే అవకాశం ఉంటుంది.

గ్లోబల్ మోడల్స్...

ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రధాన నగరాల్లో ఇలాంటి కామన్ కార్డ్ లేదా పాస్ సిస్టమ్స్ విజయవంతంగా నడుస్తున్నాయి. లండన్, సింగపూర్ వంటి ప్రాంతాల్లో ఒకే కార్డుతో బస్సు, మెట్రో, ఫెర్రీలలో ప్రయాణించవచ్చు. అదే తరహాలో హైదరాబాద్‌లో కూడా ఈ వ్యవస్థను ప్రారంభించడం మంచి పరిణామమే. కాకపోతే ధరల విషయంలో ప్రయాణికుల నుంచి కామన్ పాస్‌కు ప్రజల నుంచి ఎలాంటి స్పందన వస్తుందో వేచి చూడాలి.

వీరపాచినేని డెడ్లీ డైట్

వీఆర్కే డైట్‌పై హైదరాబాదులో కేసు నమోదు

- ఇన్సులిన్ ఆపడంతో ఆసుపత్రిలో బాధితుడు
- డైట్ పేరిట చావు డప్పు కొడుతున్న రామకృష్ణ
- ప్రాణాంతకంగా సోషల్ మీడియా సలహాలు

యూట్యూబ్ లేదా ఇన్‌స్టాగ్రామ్ ఓపెన్ చేస్తే చాలు.. రోజుకో డైట్ ప్లాన్లు మనను ఉక్కిరిబిక్కిరి చేస్తుంటాయి. వ్యాధులు తగ్గించేస్తామంటూ పెద్ద పెద్ద డప్పాలు కొట్టే హెల్త్ ఇన్ఫ్లుయెన్సర్లు మనకు బోలెడు మంది కనిపిస్తారు. అసలు వీళ్లకు ఏమైనా గుర్తింపు పొందిన మెడికల్ డిగ్రీలు ఉంటాయా అంటే అవేమీ ఉండవు. ప్రజల అమాయకత్వమే పెట్టుబడిగా నడిచే ఈ ఉచిత సలహాలు చివరికి ప్రాణాల మీదికే తెస్తే ఎలా ఉంటుంది? తాజాగా వీఆర్కే డైట్ నిర్వాహకుడు వీరమాచినేని రామకృష్ణపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కావడం తెలుగు రాష్ట్రాల్లోనూ తీవ్ర కలకలం రేపుతోంది. అసలు రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఆ ఫిర్యాదులో ఏముంది? ఈ వివాదం వెనుక అసలు నిజాలేంటి? - సహనం వందే, హైదరాబాద్ క్రైమ్


వీరమాచినేని

హైదరాబాద్‌లోని రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో వీఆర్కే డైట్ నిర్వాహకుడు వీరమాచినేని రామకృష్ణపై కేసు నమోదైంది. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ప్రస్తుతం దర్యాప్తు జరుపుతున్నారు. అసలు ఈ వివాదం ఎలా మొదలైంది, బాధితుడికి ఏం జరిగింది అనే వివరాల్లోకి వెళ్తే సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. నిర్మల్ జిల్లాకు చెందిన కల్లేడ సాయికృష్ణ అనే 30 ఏళ్ల లా స్టూడెంట్ తనకు 2018 నుంచి టైప్-1 డయాబెటిస్ ఉందని తెలిపారు. ఆయన క్రమం తప్పకుండా ఇన్సులిన్ తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. సోషల్ మీడియాలో వీఆర్కే డైట్ వీడియోలు చూసి ప్రభావితమైన సాయికృష్ణ.. హైదరాబాద్‌లోని వీఆర్కే హెల్త్ కేర్ సెంటర్‌ను సంప్రదించారు.

డైట్ సప్లిమెంట్స్... ఇన్సులిన్ స్టాప్

సెప్టెంబర్ 12న హెల్త్ కేర్ సెంటర్‌కు వెళ్లిన సాయికృష్ణ, డైట్ సప్లిమెంట్స్, ఇతర సేవల కోసం దాదాపు 26వేల రూపాయలు చెల్లించారు. అక్కడ ఉన్న ప్రతినిధులు ఆయనను వెంటనే ఇన్సులిన్ తీసుకోవడం ఆపేయాలని సూచించినట్లు బాధితుడు ఆరోపించారు. వైద్యుల సలహా లేకుండానే ఇన్సులిన్ బంద్ చేయడంతో ఆయన ఆరోగ్యం ఒక్కసారిగా క్షీణించింది. ఇన్సులిన్ ఆపేసిన రెండో రోజే సాయికృష్ణ తీవ్ర అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చేరాల్సి వచ్చింది. మెడికల్ రిపోర్టుల ప్రకారం ఆయన డయాబెటిక్ కీటో అసిడోసిస్, తీవ్రమైన డీహైడ్రేషన్‌తో బాధపడుతున్నట్లు వైద్యులు నిర్ధారించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రాయదుర్గం పోలీసులు వీరమాచినేని రామకృష్ణతో పాటు కోటేశ్వరరావు అనే వ్యక్తిపై కేసు నమోదు చేశారు.

డాక్టర్ కాకుండానే వైద్యమా?

ఈ వివాదంగా అనాధికారికంగా వైద్య సలహాలు ఇవ్వడంపై పెద్ద చర్చకే దారితీసింది. కొన్ని రకాల రోగాలను పూర్తిగా నయం చేస్తామని ప్రచారం చేయడం చట్టపరంగా నేరమని పోలీసులు స్పష్టం చేస్తున్నారు. హెల్త్‌కేర్ రీఫార్మ్ డాక్టర్స్ అసోసియేషన్ కూడా ఈ వ్యవహారంపై కోర్టును ఆశ్రయించింది. డాక్టర్ల సంఘం తెలిపిన వివరాల ప్రకారం, సోషల్ మీడియాలో అర్హత లేకుండా ఇచ్చే వైద్య సలహాలను నిరోధించేలా సివిల్ కోర్టు నుంచి ఉత్తర్వులు పొందారు. అల్లోపతి వైద్యులపై చేసే నిరాధార వ్యాఖ్యలను, సంబంధిత కంటెంట్‌ను సోషల్ మీడియా వేదికల నుంచి తొలగించాలని కోరారు.

టైప్-1 డయాబెటిస్ ఉంటే...

ఇక్కడ ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాల్సిన ముఖ్యమైన విషయమేమిటంటే టైప్-1 డయాబెటిస్ ఉన్నవారిలో శరీరం ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేయదు. అలాంటి వారు వైద్యుల పర్యవేక్షణ లేకుండా ఇన్సులిన్ ఆపేస్తే డయాబెటిక్ కీటో అసిడోసిస్ వంటి ప్రాణాంతక పరిస్థితులు ఏర్పడతాయి.యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లలో వేలమంది ఫాలోవర్లు ఉన్నారని చెప్పి సొంతంగా మందులు ఆపేయడం చావును కొనితెచ్చుకోవడమే అవుతుంది.

అందరికీ ఒకే రకమైన డైట్ సెట్ కాదు...

ప్రస్తుతం మార్కెట్‌లో కీటో డైట్, ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్, లిక్విడ్ డైట్, రా ఫుడ్ డైట్ అని రకరకాల పద్ధతులు ప్రచారంలో ఉన్నాయి. కానీ ఒకరికి పనిచేసిన డైట్ ప్లాన్ అందరికీ సెట్ అవుతుందనుకోవడం పెద్ద పొరపాటు. వయస్సు, బరువు, కిడ్నీ, లివర్ పనితీరు, రక్తంలో చక్కెర స్థాయిలు పరిగణనలోకి తీసుకోకుండా ఏ డైట్ ప్లాన్ ఫాలో కాకూడదు. దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో బాధపడేవారు ఎవరైనా సరే సరైన సర్టిఫైడ్ డాక్టర్లు లేదా అర్హత కలిగిన క్లినికల్ డైటీషియన్ల సలహాలు మాత్రమే తీసుకోవాలి.